క్లుప్తంగా

'సంస్కార భారతి' నూతన కార్యవర్గం



విజయవాడ కల్చరల్: సంస్కారభారతి మహానగర్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంస్కారభారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ తెలిపారు. సింగ్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం దర్భా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియామకాలు జరిగినట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా పసుమర్తి భాస్కర శర్మ, ఉపాధ్యక్షులుగా నందగిరి నరసింహారావు, సీహెచ్ వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా జొన్నలగడ్డ శ్రావణ్ కుమార్, కోశాధికారిగా సాయి శంకర్, రంగస్థలం, చిత్రకళ, దృశ్యకళ, సాహిత్య, వారసత్వ శాఖలకు కేఆర్‌ఎస్ గణేష్, చింతా డూండీ కృష్ణ, నాగలక్ష్మి, జీఎస్‌డీ కుసుమ సాయి, బీ రూపాశ్రీ, తదితర 14 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. మూడేళ్ల పాటు సంస్కార భారతి ఆధ్వర్యంలో సాంస్కృతిక కళారంగాలకు పెద్దపీట వేస్తూ వారిని కార్యోన్ముఖులను చేస్తారని తెలిపారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్న భర్తపై వివాహిత ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన పెళ్ళూరి స్వప్నదుర్గను రెండేళ్ల కిందట ఆటో నడుపుకొని జీవనం సాగించే శివకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. కొంతకాలంగా శివ తన భార్య దుర్గను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.


రావిచెట్టు సెంటర్‌లో బస్‌స్టాప్‌నకు వినతి

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్‌లో రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గన్నవరపు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గతంలో రావిచెట్టు సెంటర్‌లో బస్‌స్టాప్ ఉండేదని, దానిని కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో తొలగించారని గుర్తు చేశారు. అనంతరం బస్‌స్టాప్‌ను పునరుద్ధరించాల్సి ఉండగా సంబంధిత అధికారులు విస్మరించటంతో గట్టు వెనుక ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కుమ్మరిపాలెం సెంటర్ బస్‌స్టాప్‌లోనే ప్రయాణికులను దించేయడం వలన రావిచెట్టు సెంటర్ ప్రాంతానికి చెందినవారు అక్కడి వరకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలు నానా అవస్థలు పడుతున్నారని వివరించారు. ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రజల ప్రయోజనార్థం రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

నైపుణ్యాలకు పదును పెట్టాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెట్టినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్స్ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో 'బిగినర్స్ ఆండ్రాయిడ్ ఆఫ్ డెవలప్‌మెంట్' వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. వారం రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌లో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం కంప్యూటర్ విభాగ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా వారివారి రంగాల్లో చోటు చేసుకున్న మార్పులు, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలపై జరుగుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తద్వారా ఆయా రంగాలకు సంబంధించిన నూతన అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆండ్రాయిడ్ ఆఫ్ డెవలప్‌మెంట్‌లో అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి, అధ్యాపకులు అక్బర్, నవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో డాక్టర్ సత్యవేణికి 12వ ర్యాంకు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇటీవల ప్రకటించిన ఆల్ ఇండియా ఎయిమ్స్ సర్జికల్ అంకాలజీ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డాక్టర్ సత్యవేణి జాతీయ స్థాయిలో 12వ ర్యాంకు సాధించి సత్తా చాటారు. డాక్టర్ సత్యవేణి విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేసి, ప్రస్తుతం నిమ్రా వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త డాక్టర్ మాచర్ల సృష్టి కూడా జాతీయ స్థాయిలో జరిగిన నీట్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకు సాధించి బెంగళూరులోని శ్రీ జయదేవ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్డియోవాస్కులర్ సైన్స్ అండ్ రీసెర్చ్‌లో వాస్కులర్ సర్జరీ(ఎంసీహెచ్)లో ప్రవేశం పొందారు.

ఇలా చేస్తే స్వచ్ఛభారత్ ఎలా సాధ్యం?

ఓ పక్క స్వచ్ఛ భారత్‌లో మెరుగైన ర్యాంక్ సాధించడానికి ప్రజలందరూ సహకరించాలని కార్పొరేషన్ అధికారులు కోరుతున్నారు. మరో పక్క ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ తొలగించడం లేదా తాళాలు వేయడం చేస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కొందరు ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. దీంతో ఆ ప్రాంతాలు భరించలేని దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో స్వచ్ఛ భారత్ ఎలా సాధ్యమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



చిట్టి పార్కు వద్ద ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడంతో అపరిశుభ్ర వాతావరణం



కార్పొరేషన్ స్కూల్ వద్ద పబ్లిక్ టాయిలెట్‌ను తొలగించిన ప్రాంతం

- పబ్లిక్ టాయిలెట్స్ లేక అవస్థలు
- ఉన్నవాటిని ఆనవాళ్లు లేకుండా తొలగించేశారు
- మరికొన్నింటికి వాడనీయకుండా తాళాలు వేశారు
- ఆరుబయట కాలకృత్యాలతో అపరిశుభ్ర వాతావరణం



ఎర్రకట్ట రోడ్డులో పబ్లిక్ టాయిలెట్స్‌కు తాళాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్వచ్ఛ భారత్ ర్యాంక్ సాధించాలంటే ప్రజలకు అవసరమైన కనీస అవసరాలను కార్పొరేషన్ కల్పించాల్సిన అవసరం ఉంది. చిట్టినగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేయాల్సిన కార్పొరేషన్ అధికారులు వాటి ఆనవాళ్లు కూడా లేకుండా తొలగించేశారు. దీంతో వాహన చోదకులు, ప్రయాణికులు కనీసం కాలకృత్యాలు తీర్చుకునే అవకాశం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వైపున ఎర్రకట్ట రోడ్డులో కార్పొరేషన్ లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్‌ను ఎవరూ ఉపయోగించడానికి వీలు లేకుండా తాళాలు వేయడం గమనార్హం.

మూడు చోట్ల తొలగింపు

కేటీరోడ్డులోని మరుపిళ్ల చిట్టి పార్కు బయట ప్రజలు కాలకృత్యాలు తీర్చుకునేందుకు కార్పొరేషన్ ప్లాస్టిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేసింది. అయితే కేటీరోడ్డు విస్తరణ, డ్రైన్ పనుల నేపథ్యంలో వాటిని తొలగించింది. ఇక చిట్టినగర్ బస్టాప్ పక్కనే వాటర్ పంపింగ్ బూస్టర్ వద్ద మరో రెండు పబ్లిక్ టాయిలెట్స్ ఉండేవి. అయితే ఈ టాయిలెట్స్‌ను ఉపయోగించే వారు అధిక సంఖ్యలో ఉండటం, వాటిని శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేయడంలో తరచూ అలసత్వం వహించడంతో భరించలేని దుర్వాసన వచ్చేవి. దీంతో కార్పొరేషన్ అధికారులకు తలనొప్పిగా మారి ఉన్న టాయిలెట్స్‌ను కనీసం ఆనవాళ్లు కూడా లేకుండా తొలగించేశారు. దీంతో ప్రయాణికులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి. ఇక ఎర్రకట్ట రోడ్డులోని కార్పొరేషన్ స్కూల్ వద్ద మరో రెండు పబ్లిక్ టాయిలెట్స్ ఉండేవి. వాటిని కూడా నిర్వహణ సాధ్యం కాకపోవడంతో ఆ టాయిలెట్స్‌ను కూడా కార్పొరేషన్ ఇటీవల తొలగించింది.

టాయిలెట్స్‌కు తాళాలు– వాహనాల పార్కింగ్

ఎర్రకట్ట రోడ్డులో కార్పొరేషన్ లక్షలాది రూపాయలు వెచ్చించి టాయిలెట్స్‌ను నిర్మించింది. అయితే ఆ పబ్లిక్ టాయిలెట్స్‌ను ఎవరూ వినియోగించకుండా గేట్లకు తాళాలు వేశారు. నిత్యం వాహనాల రాకపోకలు, సుదూర ప్రాంతాలు ప్రయాణించే వారితో బిజీగా ఉండే ఎర్రకట్ట రోడ్డులో పబ్లిక్ టాయిలెట్స్ అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు భావించారు. అయితే ఈ టాయిలెట్స్ నిర్మించినప్పటి నుంచి గేట్లకు తాళాలు వేసి ఉండటంతో ప్రయోజనం లేకుండా పోయింది. మరో వైపున ఈ టాయిలెట్స్ కనిపించకుండా చుట్టూ ఆటోలను నిలపడంతో సమస్యగా మారింది.

కమిషనర్ స్పందించాలి!

చిట్టినగర్ వంటి ప్రధాన కూడలిలో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతంలో కనీసం ఒక్క పబ్లిక్ టాయిలెట్ కూడా లేకుండా చేయడం సరికాదని స్థానిక ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలకృత్యాలు తీర్చుకోవాలంటే రెండు, మూడు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. ఒక వేళ అత్యవసరం అయితే శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద ఉన్న టాయిలెట్స్ వరకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల గురించి తెలుసుకునేందుకు నగర పర్యటనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ చిట్టినగర్ సెంటర్‌లో పబ్లిక్ టాయిలెట్స్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రుతు పరిశుభ్రతతోనే ఆరోగ్యం

డాక్టర్ వర్షా పాటిల్



మహిళా సిబ్బందికి శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న డాక్టర్ వర్షా పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): సరైన రుతు పరిశుభ్రత పద్ధతులను పాటించడం ద్వారా మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ మహిళా సంక్షేమ సంస్థ (ఎస్‌సీఆర్‌డబ్ల్యూడబ్ల్యూఓ) అధ్యక్షురాలు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వర్షా పాటిల్ అన్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం రుతు ఆరోగ్యంపై మహిళలకు అవగాహన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వర్షా పాటిల్ మాట్లాడుతూ రుతు ఆరోగ్యంపై అపోహలను విడిచి బహిరంగంగా మాట్లాడుకున్నప్పుడే మహిళలకు పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. సరైన రుతు పరిశుభ్రత పద్ధతులు కేవలం ఆరోగ్యం గురించి మాత్రమే కాదని, అవి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతాయని అన్నారు. ముఖ్యంగా మహిళలు ఇళ్లలోను, పని ప్రదేశాలలోను సరైన రుతు శుభ్రత పద్ధతులతో ఆరోగ్యంతో పాటు చురుగ్గా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎనభై మంది మహిళా ఉద్యోగులకు శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. అనంతరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ బాలికలు రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ శైలజ, పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్, ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థుల అవస్థలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాజీ బాబా

వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులలో తీవ్ర జాప్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. వించిపేటలోని 55వ డివిజన్‌లో తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటుగా మూడు నెలలకి ఒకసారి వసతి దీవెన నేరుగా విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలో జమ చేసేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నూతన విద్యాసంవత్సరం మొదలైనప్పటికీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే కొంతమంది విద్యార్థుల కోర్సు పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు చేతికందక, ఉన్నత విద్యకు వెళ్లలేక విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.4,200 కోట్లు, హాస్టల్ మెయింటెనెన్స్ చార్జీలు రూ.2,200 కోట్లు, మొత్తంగా రూ.6,400 కోట్లు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆరోపించారు.

యువతను చైతన్యవంతులను చేయాలి

వైఎస్సార్ సీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు



ఇర్ఫాన్‌ను సత్కరించి అభినందిస్తున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా యువతను చైతన్యవంతులను చేయాలని వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సూచించారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా యువజన విభాగం కమిటీ కార్యదర్శిగా నియమితులైన విద్యాధరపురం 38వ డివిజన్‌కు చెందిన షేక్ ఇర్ఫాన్ సోమవారం వెలంపల్లిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి అతన్ని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని అన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. అలాగే సూపర్ సిక్స్ హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్, ఎస్‌కె నజీర్, డివిజన్ పార్టీ నాయకులు రేవులగడ్డ విజయ్, షేక్ రషీద్, షేక్ అబ్దుల్ మన్నాన్, వంగల భాస్కర్, రాంబాబు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, పార్టీ నేతలు

- పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వెలంపల్లి
- ఏడాదిగా ప్రశ్నించే గొంతులను అణచివేయడం తప్ప చేసిన మేలు ఏది?
- చంద్రబాబు పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప ప్రజా సంక్షేమ పాలన లేదు
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజలకిచ్చిన వాగ్దానాలను ఏడాది గడిచినా అమలు చేయలేని దద్దమ్మ ప్రభుత్వం ప్రస్తుతం నడుస్తోందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. గడిచిన ఏడాదిగా పాలకుల తప్పులను ప్రశ్నించే గొంతులను అణచివేయటం తప్ప కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏ ఒక్క మేలు చేయలేదని ఆరోపించారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ మీడియా సెల్ రూపొందించిన పుస్తకాన్ని పశ్చిమ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులతో కలిసి సోమవారం వెలంపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలిసే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందించామన్నారు. ఈ పుస్తకం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు జరిగాయనే అంశాన్ని ప్రజలకు వివరిస్తుందన్నారు. 2019 నుంచి 2024 వరకు జగన్ అంటే నమ్మకం అనేటటువంటి పరిపాలన సాగిందని, నేడు చంద్రబాబు అంటే మోసం అనే పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు పాలనలో రెడ్‌బుక్ రాజ్యాంగం తప్ప సంక్షేమ పాలన నడవదన్నారు. చంద్రబాబు చేసే మోసాలను సాక్ష్యాలతో కూడిన వివరణ ప్రజలకు తెలియజేసేందుకు నడుం బిగించామన్నారు. ఏడాది కాలంలో ఆరోగ్యశ్రీ, రైతుభరోసా, విద్యాదీవెన వంటి ప్రజా సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేశారన్నారు. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి అప్పు చేసి ఏమి సాధించారని ప్రశ్నించారు. ఒక్క సంక్షేమ పథకమైన అమలు చేశారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు.

పశ్చిమంలో కుంటుపడిన అభివృద్ధి

పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. తాను ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి తప్ప ఎటువంటి కొత్త కార్యక్రమాలకు శ్రీకారమే లేదన్నారు. నాడు తాను చేసిన శంకుస్థాపనలను నేడు కూటమి నేతలు ప్రారంభిస్తూ శునకానందం పొందుతున్నారన్నారు. కూటమి పాలనను అణచివేసే విధంగా ప్రజలతో కలిసి రానున్న రోజుల్లో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బండి పుణ్యశీల, మండెపూడి చటర్జీ, యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, పడిగిపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, గోదావరి గంగ, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు హయత్, దుర్గగుడి మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, వివిధ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్, బొందిలి నరేంద్ర సింగ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

వివాహితను నవవధువుగా చెప్పి మోసం

వరుడి నుంచి రూ.2.88 లక్షలు కాజేసిన మధ్యవర్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):వివాహమై పిల్లవాడు ఉన్న యువతిని పెళ్లి కాని అమ్మాయిగా నమ్మించి లక్షలు దండుకొని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే కర్నాటక కొప్పుల్ జిల్లాకు చెందిన జి.దుర్గాప్రసాద్ (34) వివాహం కాకపోవడంతో స్థానికంగా ఉన్న మ్యారేజీ బ్యూరోకి చెందిన శ్రీదేవి అనే మహిళ ద్వారా రాజమండ్రి, విజయవాడలోని మధ్యవర్తులను ఆశ్రయించాడు. వారు విజయవాడకు చెందిన తాయారు అనే పెళ్లిళ్ల మధ్యవర్తిని పరిచయం చేశారు. విజయవాడకు చెందిన తాయారు, పార్వతి, విమల, ఆటో డ్రైవర్ అప్పారావు కృష్ణలంకకు చెందిన పల్లవి అలియాస్ ఆమని అనే యువతిని అతడి కుటుంబ సభ్యులకు చూపించి గత నెల 13న విజయవాడ కృష్ణలంకలోని ఒక హోటల్‌లో పెళ్లి చూపులు తతంగం జరిపించారు. అమ్మాయి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ పెళ్లికి ముందే రూ.2.70 లక్షలు వరుడి కుటుంబం వద్ద మధ్యవర్తి వసూలు చేశాడు. పెళ్లి ఖర్చుల నిమిత్తం మరో రూ.18 వేలు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అదే రోజు పార్వతి అనే మహిళకు రూ.50 వేలు ఇచ్చారు. ఈ నెల ఐదున దుర్గగుడిలో వివాహం జరిగింది. కర్నాటక వెళ్లి ఏడో తేదీన వరుడి ఇంటి వద్ద రిసెప్షన్ జరుపుకొన్నారు. పల్లవి వెంట కర్నాటక వెళ్లిన ఆమె సోదరుడు హరీష్ రిసెప్షన్ అయ్యాక తన తల్లికి బాగోలేదంటూ వరుడి కుటుంబం వద్ద రూ.50 వేలు తీసుకుని అదృశ్యమయ్యాడు. మూడు రోజుల తరువాత పల్లవి తనకు అంతకు ముందే వివాహమైందని, ఒక బాబు కూడా ఉన్నట్లుగా చెప్పింది. దాంతో దుర్గాప్రసాద్ తాను మోసపోయినట్లు గుర్తించి తన కుటుంబ సభ్యులకు వివరించాడు. పల్లవిని తీసుకొని ఈ నెల 14వ తేదీన విజయవాడ బస్టాండ్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి కృష్ణలంక పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. తనను మోసం చేయటమే కాకుండా తన నుంచి రూ.2.88 లక్షల నగదును సైతం కాజేశారని వాపోయాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కృష్ణలంక పోలీసులు దుర్గాప్రసాద్‌ను వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు పంపించారు. దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోని 40వ డివిజన్ లారీ స్టాండ్ వద్ద ఉన్న ఈఎస్‌ఎస్‌ఆర్(ఎర్త్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్) డెలివరీ పైప్‌లైన్‌కు ఉన్న గేట్ వాల్వ్ పాడైపోయినందున దానికి మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన ఆయా ప్రాంతాల్లో తాత్కాలికంగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గేట్‌వాల్వ్ మరమ్మతులు ఈ నెల 17వ తేదీ నుంచి 18వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయని, ఈ కారణంగా 40వ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, మానవ మందిరం రోడ్డు, క్రాంబేరోడ్డులో నీటి సరఫరా నిలిపివేస్తున్నామని, తిరిగి 18వ తేదీ సాయంత్రం 6 గంటలకు సరఫరాను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

ఆలయ భద్రతపై రాజీ వద్దు

ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో విధులు నిర్వహించడమే కాకుండా ఆలయ భద్రత అంశంలో రాజీ పడవద్దని ఈవో శీనానాయక్ భద్రతా సిబ్బందికి సూచించారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ పోలీస్ సిబ్బందితో ఆయన సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు స్ట్రాంగ్ రూమ్‌తో పాటు ఇతర కీలక పాయింట్లలో భద్రత పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఏఐతో విస్తృత అవకాశాలు



మాట్లాడుతున్న ప్రదీప్ పులిపాటి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను వినియోగించుకోవటం ద్వారా విస్తృత అవకాశాలను పొందవచ్చని అమెరికాకు చెందిన ట్రోపోలీప్ కంపెనీ సీఈఓ ప్రదీప్ పులిపాటి అన్నారు. కేబీఎన్ పీజీ కళాశాల ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో 'రివల్యూషనరీ అప్లికేషన్స్ ఆఫ్ ఏఐ ఇన్ రియల్ వరల్డ్' అనే అంశం మీద సోమవారం ఆయన గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న నవీన మార్పులు, వివిధ రంగాల్లో (వాణిజ్యం, వైద్యం, రవాణా, విద్య, వ్యవసాయం) ఏఐ వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. భారతదేశంలో ఏఐ వృద్ధికి ఉన్న అవకాశాలను వివరించారు. ఏఐ, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, నేచురల్ లెర్నింగ్ ప్రాసెసింగ్, జనరేటివ్ ఏఐ తదితర భావనలను ఉదాహరణ పూర్వకంగా వివరించారు. ట్రోపోలీప్ సంస్థ ద్వారా అభివృద్ధి చేసిన ప్రాజెక్టుల ఉదాహరణల ద్వారా విద్యార్థులకు సమకాలీన అంశాలపై స్పష్టమైన అవగాహన కలుగజేశారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ టెక్నాలజీ మీద అవగాహనతో పాటు దాన్ని తగిన సందర్భంలో, తగిన విధంగా వినియోగించడంలో కూడా విద్యార్థులు నైపుణ్యం సాధించాలన్నారు. హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి.నారాయణరావు, పీజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ వీటీ రాంపవన్ మల్లాది, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డూండీ గణేష్ మహోత్సవాలకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సుమన్, వెంకట్, రాకేష్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం పరిధిలోని లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహోత్సవాలకు సోమవారం శంకుస్థాపన జరిగింది. ప్రముఖ సినీ నటుడు సుమన్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కుమారుడు వెంకట్ ముఖ్యఅతిథులుగా హాజరై 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు పూజాదికాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పండుగకు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ వినాయక విగ్రహానికి మించిన ఎత్తులో మట్టితో మహా గణపతి విగ్రహాన్ని తయారు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా 72 అడుగుల ఎత్తులో మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వినాయక చవితి మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలి



పటమట(విజయవాడతూర్పు): నగర పౌరులకు వీఎంసీ అందించే సేవల్లో సమస్యలు ఉత్పన్నమయితే వెంటనే వాటిని పరిష్కరించేందుకు అధికారులు నిరంతరం సిద్ధంగా ఉండాలని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 14 మంది తమ ఫిర్యాదులను అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుకు సంబంధించి స్వయంగా పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని తీసుకొచ్చే విధంగా ఆయా విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికపై -06, ఇంజినీరింగ్–02, రెవెన్యూ -02, ప్రజారోగ్యం–03, ఎస్టేట్–01 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యకుమారి, పి.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.